



బహిరంగ సభకు పోటెత్తిన జనం

ఉద్వేగ స్వరం.. అభివృద్ధి పథం!

- కుప్పం అభివృద్ధిపైనే ప్రధాన ప్రసంగం
- మెజారిటీ తగ్గడంపై ఆవేదన
- మీ భవిష్యత్తుకోసం ఎంత కష్టమైనా పడతానని హామీ
- కుప్పంలో చంద్రబాబు అంతరంగం ఆవిష్కరణ
- ఆద్యంతం ఆకట్టుకున్న వినూత్న వ్యవహార శైలి

మళ్లీ జన్మంటూ ఉంటే కుప్పం ముద్దుబిడ్డగా జన్మిస్తా. ఇన్నాళ్లుగా నన్ను ఆదరిస్తున్న మీ రుణం తీర్చుకుంటా. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి, నాలుగుసార్లు ముఖ్యమంత్రి కావడానికి అవకాశం ఇచ్చిన మిమ్మల్ని ఎన్నడూ మరువలేను. అన్నదమ్ముడిగా ఉంటూ మీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా.

'నాకు వచ్చింది అధికారం కాదు, బాధ్యత. దీన్ని కుప్పంలో నిరూపిస్తా. నేను చెప్పేది చేస్తా. మీ జీవితాలు బాగు పడుతాయి.'

'నేను ప్రజలకోసమే సంపాదిస్తా. ప్రజలకోసమే కష్టపడుతా. తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలి.'

'రాష్ట్రమంతా ఒక ఊపు ఊపిన మెజారిటీలు వచ్చాయి. కుప్పంలో 48 వేలేనా? ఎన్నడూ బయటకు రాని మా ఇంటి ఆడవాళ్లు వచ్చారు. భువనేశ్వరి స్వయంగా క్యాంపైన్ చేసే పరిస్థితి వచ్చింది.'

'సమాజంలో ఇంకా మానవత్వం బతికే ఉంది. అందుకు నిదర్శనం ఒక ఆడబిడ్డ తనకున్న మూడు ఎకరాల్లో ఒక ఎకరా అమ్మి మరీ రూ.25 లక్షలు అమరావతి నిర్మాణానికి విరాళమిచ్చింది.'

కుప్పంలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగంలోని ఉద్వేగ సందర్భాలు ఇవి. భావోద్వేగ పూరితంగా ప్రసంగించిన ఆయన కుప్పం అభివృద్ధి గురించి ఏమాత్రం మరచిపోలేదు. సొంత నియోజకవర్గానికి ఏం చేయబోతున్నారో చెబుతూనే, ఇక్కడ తనకు వచ్చిన మెజారిటీ పట్ల తీవ్ర అసంతృప్తి, మనస్తాపం వ్యక్తం చేశారు. ఎక్కడా ఎటువంటి భేషజాలు, అధికార దర్పాలు ప్రదర్శించకుండా సరికొత్తగా తనను తాను ఆవిష్కరించుకున్న తీరు, ప్రసంగ శైలి ఆద్యంతం ఆకట్టుకుంది.

చంద్రబాబు కుప్పం పర్యటన తొలిరోజైన మంగళవారంనాడు 30 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. హెలికాప్టరులో మధ్యాహ్నం ఒంటి గంటకు పీఈఎస్‌లోని హెలిప్యాడ్‌లో దిగిన సీఎం అధికారులు, పార్టీ నాయకుల నుంచి స్వాగత సత్కారాలు అందుకున్నారు. తర్వాత నేరుగా హంద్రీనీవా కాలువ సందర్శనకు బయలుదేరారు. జల్లిగానిపల్లె వద్ద మధ్యాహ్నం 2 గంటలకు, చిన్నారిదొడ్డి వద్ద 2.40 గంటలకు కాలువను సందర్శించి అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు కూడలిలో బహిరంగ సభలో సాయంత్రం 4.35 గంటల నుంచి 5.55 గంటలదాకా ఏకధాటిగా ప్రసంగించారు.

కుప్పం అభివృద్ధిపైనే దృష్టి: సాధారణ వ్యవహార శైలికి భిన్నంగా ఈసారి చంద్రబాబు ప్రధానంగా కుప్పం అభివృద్ధిపైనే దృష్టి పెట్టారు. అప్పుడప్పుడూ రాష్ట్రాభివృద్ధి, రాజధాని అమరావతి వంటి అంశాలను ప్రస్తావించినా అంతలోనే కుప్పం నియోజకవర్గానికి ఏం చేయబోతున్నారో చెప్పారు. గత వైసీపీ పాలనలో కుప్పంలో చెలరేగిన రౌడీమూకలను హెచ్చరిస్తూనే, రాబోయే అయిదేళ్లలో ఏయే అంశాలలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పెట్టాలనుకున్నారో ఏకరువు పెట్టారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'మళ్లీ సీఎంగా..' అన్న శీర్షికన ప్రచురితమైన వార్తాకథనంలో ప్రస్తావించిన వివిధ ఆగిన అభివృద్ధి పనులను గురించి పేర్కొంటూ అన్నింటినీ సాధ్యమైనంత త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

అమరావతి, మెజారిటీపై భావోద్వేగం: చంద్రబాబు తన మెజారిటీ కేవలం 48 వేలకు పరిమితం కావడాన్ని భావోద్వేగంతో ప్రస్తావించారు. 'ఒకప్పుడు కుప్పంలో అందరూ మంచివాళ్లే ఉండేవారని, ఇప్పుడు కొంతమంది మారిపోయారు. మీరు బాగు పడితే చూడాలని నా కోరిక. ఇక్కడ ఇప్పుడు పుల్లలు పెట్టేవాళ్లు తయారయ్యారు. అయినా బాధ లేదు. వచ్చే అయిదేళ్లలో వారిని మారుస్తా. ప్రతి కుటుంబానికి మంచి జరిగేలా చూస్తా.' అన్నారు. అమరావతిని తలచుకుని భావోద్వేగంతో కదిలిపోయారు. అమరావతికి యువతి ఒకరు ఎకరా అమ్మి ఇచ్చిన విరాళం గురించి ప్రస్తావించారు. డ్వాక్రా, మెప్మా సంఘాలతోపాటు టీడీపీ కుప్పం రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఇచ్చిన రూ. లక్ష విరాళాలను స్వీకరిస్తూ, ఆయా సందర్భాల్లో అమరావతికోసం తాను ఎంత చేసింది గుర్తు చేసుకున్నారు.

- కుప్పం



రాజధాని కోసం డ్వాక్రా, మెప్మా తరపున రూ.4.5 కోట్ల చెక్కు అందజేత

బాబుకు బ్రహ్మరథం

కుప్పం/శాంతిపురం: చంద్రబాబుకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. తొలుత పీఈఎస్ వైద్య కళాశాల హెలిప్యాడ్ వద్ద జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠలతోపాటు జిల్లా స్థాయి అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా ఎమ్మెల్యేలు భానుప్రకాష్, అమర్‌నాథ్‌రెడ్డి, పులివర్తి నాని. గురజాల జగన్మోహన్, థామస్, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆదిమూలం, మాజీ ఎమ్మెల్సీలు గౌనివారి శ్రీనివాసులు, దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఆర్.గాంధీ, సుగుణమ్మ, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, కుప్పం నియోజకవర్గ నేతలు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, ఆనందరెడ్డి, బాబునాయుడు, నాయకులు భీమినేని చిట్టిబాబు, శ్రీధర్‌వర్మ, కార్జాల అరుణ, నాగేశ్వరరాజు తదితరులు హాజరయ్యారు. గేటు వద్దకు ఉదయం 10 గంటల నుంచే పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు నియోజకవర్గ ప్రజలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి హంద్రీ-నీవా సందర్శనకు బయలుదేరిన సందర్భంలో పీఈఎస్ గేటువద్ద భారీ గజమాలతో స్వాగతం పలికారు. మహిళలు పూలవర్షం కురిపించి మంగళ హారతులు పట్టారు. అక్కడినుంచి హంద్రీనీవా సందర్శనకు బయలుదేరినప్పుడు మార్గ మధ్యం పోడూరు, కదిరివోబనపల్లె, కనమలదొడ్డి, కర్లగట్ట, జల్లిగానిపల్లె, బండతిప్పనపల్లె, బారామతి, చిన్నారిదొడ్డి, నడింపల్లె, తుమ్మిశి, దొంకుమానిపల్లె, తుమ్మిశి రోడ్డు, మోడల్ స్కూల్ తదితర ప్రాంతాలలో ఆయనకు ప్రజలనుంచి ఘన స్వాగతం లభించింది. చంద్రబాబు ప్రతిచోట బస్సులోనుంచే ప్రజలకు అభివాదం చేశారు. అయితే కర్లగట్ట వద్ద మాత్రం డోర్ దాకా వచ్చి అభివాదం చేశారు. తుమ్మిశి, మోడల్ స్కూల్ వద్ద విద్యార్థులు పూలవర్షం కురిపించడంతో డోర్ వద్దకు వచ్చి వారికి విజయచిహ్నం చూపించారు. వారి సమస్యలు విని, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గుండె జబ్బుతో బాధ పడుతున్న దొంకుమానుపల్లెకు చెందిన భాస్కర్‌శెట్టి భార్య చైతన్య రోడ్డు వార కూర్చుని చంద్రబాబుకు నమస్కారం చేశారు. ఆమెను చూసిన చంద్రబాబు బస్సు దిగి నేరుగా ఆమె వద్దకు చేరుకున్నారు. సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఆయన అటు కదలగానే స్విమ్స్, చెన్నై, పీఈఎస్, బెంగళూరు ఆసుపత్రులనుంచి చైతన్యకు ఫోన్లు వచ్చాయి. తమ వద్దకు వస్తే వైద్యం చేస్తామని చెప్పారు. శివపురం వద్ద సొంత ఇంటి నిర్మాణ పనులను సైతం చంద్రబాబు పరిశీలించారు. అక్కడే సుమారు 20 నిముషాలపాటు నిర్మాణ పనుల గురించి సంబంధిత వ్యక్తులతో చర్చించారు. కడపల్లె వద్ద ఉన్న బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థులను బస్సు డోర్‌లోనుంచే పలకరించారు. బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగానికి ప్రజలనుంచి విపరీతమైన స్పందన లభించింది. భారీ వర్షం పడినా జనం కదలకుండా నిలబడి చంద్రబాబు ప్రసంగం విన్నారు ఆయన ప్రతి మాటకూ జేజేలు పలికారు. విజయ చిహ్నాలు చూపుతూ ఉత్సాహంతో కేరింతలు కొట్టారు.

'టెట్' ఫలితాల విడుదల

చిత్తూరు (సెంట్రల్), జూన్ 25: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫలితాలను మంగళవారం రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఎన్నికల ముందు జగన్ ప్రభుత్వం బీఈడీ, డీఎడ్ అభ్యర్థుల కంటి తుడుపు చర్యగా కేవలం 6100 ఖాళీలు మాత్రమే భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. హడావుడిన చేపట్టిన ఈ ప్రక్రియలో భాగంగా ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు టెట్ నిర్వహించారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో ఫలితాల విడుదలకు బ్రేక్ పడింది. ఈ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 31,037 మంది బీఈడీ, డీఎడ్ అభ్యర్థులు పరీక్షలు రాశారు. తిరుపతి జిల్లాలో 19,859 మంది కాగా, చిత్తూరు జిల్లాలో 7,173 మంది, అన్నమయ్య జిల్లాలో 4005 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. వీరిలో 18 వేల మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గతంలో టెట్ రాయడంలో అవకాశం కోల్పోయిన బీఈడీ, డీఎడ్ అభ్యర్థులతోపాటు ఇటీవల నిర్వహించిన టెట్‌లో ఫెయిలైన వాళ్లకూ రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. జూలై ఒకటి నుంచి టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో విద్యాశాఖ అందుకు తగిన విధంగా సన్నాహాలు చేస్తోంది. కాగా, జూలై ఒకటో తేదీన డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనుండటంతో వీరిలో ఆశలు చిగురించాయి.

వీఆర్ఎస్ తీసుకున్న శ్రీనివాసరాజు

- టీటీడీ జేఈవోగా తనదైన ముద్ర



తిరుమల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) జేఈవోగా సుదీర్ఘకాలంగా పనిచేసిన కేఎస్ శ్రీనివాసరాజు వీఆర్ఎస్ తీసుకున్నారు. ఏపీ ఐఏఎస్ క్యాడర్‌లో 2001 బ్యాచ్‌కు చెందిన ఆయన 2011లో వైజాగ్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న సమయంలో టీటీడీ జేఈవోగా నియమితులయ్యారు. ఏప్రిల్ 20వ తేదీన జేఈవోగా బాధ్యతలు తీసుకుని 2019 జూన్ వరకు ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ఎనిమిదేళ్ల రెండు నెలలపాటు పనిచేశారు. నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాల్లో జేఈవోగా విధులు నిర్వహించి, టీటీడీలో తనదైన ముద్ర వేశారు. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక ఆయన ఇంటర్ కేడర్‌పై తెలంగాణ రాష్ట్రానికి వెళ్లారు. మార్చి నెలతో డిప్యుటేషన్ గడువు ముగియడంతో పొడిగింపునకు క్యాట్‌ను ఆశ్రయించారు. అనుమతి రాకపోవడంతో ఏపీకి రాక తప్పలేదు. గత మే నెలలో ఏపీ సీఎస్‌కు రిపోర్టు చేశారు. టీటీడీ ఈవోగా వచ్చేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేసినా కూటమి ప్రభుత్వం శ్యామలరావును ఈవోగా నియమించింది. దీంతో ఈనెల 19వ తేదీన శ్రీనివాసరాజు వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో మంగళవారం ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.





హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ - అనంతపురం ఇన్‌చార్జి డీఐజీ షెముషి - ఎస్పీ మణికంఠ

సీఎం నేటి షెడ్యూల్ ఇలా..

ఉదయం 10.30 గంటలు: ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ప్రజలనుంచి వినతుల స్వీకరణ

మధ్యాహ్నం 12.00: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కుప్పం నియోజకవర్గ అధికారులతో సమీక్ష

2.35: పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో టీడీపీ నియోజకవర్గ సమావేశం

సాయంత్రం 4.10: పీఈఎస్ వైద్య కళాశాల హెలిప్యాడ్‌నుంచి బెంగళూరుకు పయనం

'అమరావతి'కి విరాళాలు

రాజధాని అమరావతి అభివృద్ధికి మహిళా సంఘాల తరపున రూ.4.5కోట్ల విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేశారు. టీడీపీ రామకుప్పం మండల శాఖ తరపున పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి రూ.5 లక్షలు, కుప్పం రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ రూ.లక్ష చెక్కులు అందించారు.

కుప్పం రుణం తీర్చుకుంటా

మండలాలుగా మల్లానూరు, రాళ్లబూదుగూరు ● ఏడాదిలో హంద్రీనీవా జలాలు ● పాలారునదిపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం ● ఉద్యాన పంటల మార్కెటింగ్ కార్గో విమానాశ్రయం ● ద్రావిడ వర్సిటీ ప్రక్షాళన చేస్తా ● సీఎం చంద్రబాబు వరాల జల్లు



శాంతిపురం మండలం కడపల్లె వద్ద తన ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు నాయుడు

కుప్పం, జూన్ 25: తనను ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి, నాలుగుసార్లు సీఎం కావడానికి అవకాశం ఇచ్చిన కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట మంగళవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

రైతుల కోసం..

కుప్పంలో వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పువ్వులు విస్తారంగా పండుతాయి. వీటి మార్కెటింగ్ కోసం కార్గో విమానాశ్రయాన్ని స్థాపించి, బెంగళూరు, కృష్ణగిరి, చెన్నై, కేజీఎఫ్‌తోపాటు విదేశాలకు ఎగుమతి చేసి రైతులు లాభాలు గడించేలా చర్యలు తీసుకుంటా. కుప్పం మార్కెట్ యార్డులో సగంలో ఆగిపోయిన కోల్డ్ స్టోరేజీ భవనాన్ని పూర్తి చేస్తా. అన్ని మండల కేంద్రాల్లోనూ మినీ కోల్డ్ స్టోరేజీ భవనాలను నిర్మిస్తా. పట్టు, వ్యవసాయ పరిశ్రమలకు అవసరమైన సబ్సిడీలు, ప్రయోజనాలు అందిస్తా. తద్వారా రైతులు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటా.

సాగునీటికి ప్రాధాన్యం

నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వి.కోట దాకా హంద్రీనీవా జలాలు తీసుకొచ్చా. ఎన్నికల ముందు జగన్ వచ్చి సినిమా సెట్టింగ్ వేసి డ్రామా చేసేసి వెళ్లారు. నేను 80 శాతం పని పూర్తి చేస్తే మిగిలిన 20 శాతం పని కూడా చేయలేదు. నేను కచ్చితంగా కాలువ నిర్మాణం పూర్తి చేసి కృష్ణా జలాలను ఏడాదిలోగా తీసుకొస్తాను. అన్ని చెరువులను నింపుతాను. సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తాను. ఇక, మనం అధికారంలో ఉన్న సమయంలో పాలారు నదిపై చెక్ డ్యామ్‌లు నిర్మించాం. ఇప్పుడు మళ్లీ వీలైనన్ని చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తా. గుడుపల్లె మండలం యామనూరు, శాంతిపురం మండలం ప్రీతిచామనూరు గ్రామాల సమీపంలో ప్రతిపాదిత రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి వీలైనంత త్వరలో పూర్తి చేస్తాను.

మళ్లీ కడా

ఈ ఐదేళ్లుగా కుప్పంపై జగన్ కక్షగట్టాడు. విధ్వంసం సృష్టించాడు. మళ్లీ సరిచేస్తా. ఈ పతనానికి కారణమైన అందరి లెక్కలు తేలుస్తా. మళ్లీ కడా (కుప్పం పట్టణాభివృద్ధి సంస్థ)ను ఏర్పాటు చేసి నాలుగు మండలాల్లో అభివృద్ధి పనులు చేపడతా. ప్రతి మండల కేంద్రాన్ని రూ.10 కోట్లతో గ్రీన్ టౌన్‌గా అభివృద్ధి చేస్తా. పంచాయతీల స్థాయిని బట్టి రూ.కోటి నుంచి రూ.2 కోట్లతో పనులు చేపడతా. మల్లానూరు, రాళ్లబూదుగూరును కూడా మండలాలుగా చేస్తా.

యువత కోసం..

కుప్పంలో ఎక్కడగా పండే టమోటాకు అనుబంధంగా కెచప్, జ్యూస్ పరిశ్రమలను నెలకొల్పుతా. టెక్స్‌టైల్స్, సాఫ్ట్‌వేర్ కంపెనీల ఫ్రాంచైజీల స్థాపనకు చర్యలు తీసుకుని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా.

ద్రావిడ వర్సిటీని గాడిలో పెడతా

ఈ ఐదేళ్లలో ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని భ్రష్టు పట్టించారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి విధ్వంసం చేశారు. దాన్ని గాడిలో పెడతాను. 254 మంది సిబ్బంది 10 నెలలుగా వేతనాలు లేకుండా ఇబ్బంది పడుతున్నారు. వారందరికి వెంటనే జీతాలు రిలీజ్ చేస్తాను.

రౌడీలకు హెచ్చరిక

కుప్పంలో ఎవరైనా రౌడీయిజాన్ని చేయాలని చూస్తే అదే వాళ్లకు చివరి రోజు అవుతుంది. ప్రశాంతంగా ఉన్న కుప్పంలో అలజడి సృష్టిస్తే సహించేది లేదు. రామకుప్పంలో గంజాయి సాగు అధికమైంది. కుప్పాన్ని గంజాయి స్మగ్లింగ్ కేంద్రంగా మార్చేశారు. దీనిని గంజాయి రహిత నియోజకవర్గంగా తయారు చేస్తా.

ఇంకా ఏం చేస్తానంటే..

- ఎక్కడికక్కడ ఆగిపోయిన వివిధ కులాలకు చెందిన కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తా. సభలు, సమావేశాలు, పెళ్లిళ్లు, పేరంటాళ్లకు అనువుగా తీర్చిదిద్దుతా.
- ఆర్టీసీ డిపోకు ఇంకా అవసరమైన బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు, ఏసీ బస్సులు తెస్తాను. అత్యాధునిక సౌకర్యాలతో మోడల్ డిపోగా తీర్చిదిద్దుతాను.
- కుప్పం చుట్టూ అవుటర్ రింగ్ రోడ్డు పూర్తి చేస్తా. రింగ్ రోడ్డు నుంచి పల్లెలను కలుపుకుంటూ తమిళనాడు కృష్ణగిరి, కర్ణాటక కేజీఎఫ్‌లను అనుసంధానం చేస్తా. బెంగళూరునుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్ హైవేకి లింకేజ్ పెట్టి, కుప్పంనుంచే ఇటు బెంగళూరు, అటు చెన్నైకి గంటలో చేరేలా చర్యలు చేపడతా.
- కుప్పం మండలంలోని బేటరాయస్వామి కొండ, గుడుపల్లె మండలం మల్లప్పకొండ, యామగానిపల్లె ధర్మరాజుల దేవాలయం, శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు కోదండరామస్వామి దేవాలయంతో పాటు పల్లెల్లోని మరో 100-150 ఆలయాలను అభివృద్ధి చేస్తా.
- ఈ అయిదేళ్లలో మూలనపడ్డ ఎన్టీఆర్ సుజల ప్లాంట్లను మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకొస్తాను. నియోజకవర్గ ప్రజలకు శుద్ధ జలం అందిస్తా.

మీ తీరువల్లే..

● టీడీపీ సమన్వయ కమిటీ భేటీలో చంద్రబాబు అసహనం

కుప్పం, జూన్ 25: పనిచేసే వాళ్లను పక్కనపెట్టి, షో చేసేవాళ్లను ముందుకు తోయడం వల్లే మొన్న ఎన్నికల్లో మెజారిటీ తగ్గిందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నేతలపై అసహనం వ్యక్తం చేశారు. కుప్పంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంగళవారం సాయంత్రం ఆయన నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీతో సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఎన్నికల్లో తనకు లభించిన 48 వేల ఓట్ల మెజారిటీపై చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాష్ట్రమంతటా ఒక ప్రభంజనంలా టీడీపీకి ఓట్లు పడి, అత్యధిక ఓట్లతోపాటు, సీట్లతో అధికారంలోకి రావడం.. చాలాచోట్ల 80 వేల నుంచి 95 వేల మెజారిటీలు వచ్చాయని గుర్తు చేశారు. పదేపదే చెబుతున్నా, టీమ్‌ను మార్చినా మెజారిటీ ఎందుకు పెరగలేదని నాయకులను నిలదీశారు. ప్రజలతో మమేకం కావాల్సినంతగా కాలేదని, క్షేత్రస్థాయి పరిస్థితులను బేరీజువేసి పనిచేసేవారెవరో, చేయని వారెవరో నిర్ధారించుకోవడంలో తప్పటడుగులు పడ్డాయని అన్నారు. ఇదే తీరుతో వ్యవహరిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక మీదటైనా కష్టపడేవారిని గుర్తించి బాధ్యతలు అప్పగించాలని, ఆ పని తానే చేస్తానని అన్నారు. ఎక్కడా పొరబాట్లు జరగకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా పర్యవేక్షించాలని పార్టీ శ్రేణులకు జాగ్రత్తలు చెప్పారు. కొందరు మండల అధ్యక్షులు, నాయకులు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

హంద్రీ- నీవా కాలువ సందర్శన

శాంతిపురం, జూన్ 25: శాంతిపురం మండలం జల్లిగానిపల్లె, చిన్నారిదొడ్డి గ్రామాల సమీపంలోని హంద్రీ నీవా కాలువను మంగళవారం సీఎం చంద్రబాబు పరిశీలించారు. అక్కడే అధికారులతో సమీక్షించారు. ఈ కాలువ వద్ద సుమారు 30 నిమిషాలు గడిపారు. వెంట అధికారులు మాత్రమే ఉన్నారు తప్ప, పార్టీ నాయకులు లేరు.

సీఎం దృష్టికి 'వి.కోట బైపాస్'

● తూర్పు వైపు రోడ్డు వేయిస్తామని చంద్రబాబు హామీ

వి.కోట, జూన్ 25: కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు దృష్టికి వి.కోట బైపాస్ అంశాన్ని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు తీసుకెళ్లారు. టీడీపీ హయంలో తూర్పు వైపున రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపితే గత వైసీపీ ప్రభుత్వం కర్ణాటక మీదుగా ప్రతిపాదించిందని వివరించారు. రైతులు హైకోర్టును ఆశ్రయించగా.. కర్ణాటక, ఇటు ప్రాంతాల్లో జరుగుతున్న భూసేకరణ పనులు ఆపాలని కోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. వి.కోట అభివృద్ధి దృష్ట్యా తూర్పు వైపునే బైపాస్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని సీఎం వారికి హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, నేతలు సోమశేఖర్, శబరీష్, షేక్‌ఉమ్మర్, విశ్వనాథ్, జనార్దన్‌రెడ్డి, రమేష్, రామూర్తిఆచ్చారి, భక్తా, షణ్ముగం, గుణశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సీఎంతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్




హెలిప్యాడ్ వద్ద మాజీ ఎమ్మెల్సీ గౌనివారిని అడ్డుకున్న రోప్‌పార్టీ పోలీసులు - హెలిప్యాడ్‌లోకి అనుమతులు లేవనడంతో వేచి ఉన్న మాజీ ఎమ్మెల్యే సీకే బాబు

పోలీసుల అత్యుత్సాహం

● టీడీపీ శ్రేణులను అడ్డుకున్న బలగాలు



హెలిప్యాడ్‌లోకి దూకి వెళుతున్న యువకులను బయటకు లాగేస్తున్న పోలీసులు

కుప్పం/వి.కోట, జూన్ 25: చంద్రబాబు పర్యటనలో పోలీసులు అత్యుత్సాహం కనబరిచారు. పీఈఎస్ ఆస్పత్రిలోని హెలిప్యాడ్ వద్దకు వెళుతున్న టీడీపీ నేతలను అడ్డుకోవడంతో వారు అసహనం వ్యక్తం చేశారు. తనకు పాస్ ఉందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు చూపినా రోప్‌పార్టీ అడ్డుకుంది. దీన్ని గమనించిన ఏఎస్పీ రోప్‌పార్టీని వారించి ఆయన్ను లోపలు పంపారు. చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు తదితర పేర్లు జాబితాలో లేవని ఆపేశారు. అదే సమయంలో అటు వచ్చిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయన్ను లోపలకు తీసుకెళ్లారు. శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం, కుప్పం మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులను, నియోజక వర్గ తెలుగు మహిళలనూ అనుమతించక పోవడంతో వారు వాగ్వాదానికి దిగి కన్నీళ్లపర్యంతమయ్యారు. చంద్రబాబు వచ్చేటప్పటికి ఇద్దరు యువకులు ప్రహరీ దూకి హెలిప్యాడ్ వద్దకు పరుగులు తీయగా పోలీసు సిబ్బంది వెంటపడి బయటకు పంపేశారు. తన పర్యటనలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది పెట్టొద్దని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినా, కుప్పంలో మాత్రం పట్టణంలోకి వెళ్లి, వచ్చే మార్గాలను పోలీసులు మూసేయడం సరి కాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వినాయకంకు ఘన నివాళులు



పూతలపట్టు, జూన్ 25: వరదల్లో చిక్కుకున్న పలువురిని కాపాడేందుకు వెళ్లి మృతి చెందిన మిలటరీ ఉద్యోగి వినాయకంకు ఐటీబీపీ అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు. పూతలపట్టు మండలం చిన్నబండపల్లెకు చెందిన వినాయకం(32) ఐటీబీపీలో ఉద్యోగం చేస్తూ 2023 జూన్ 25న ఉత్తరాఖండ్‌లో వరదలు రాగా భక్తులను రక్షించేందుకు హెలికాప్టరులో వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ సంఘటన జరిగి ఏడాదైన సందర్భంగా మంగళవారం ఐటీబీపీ కమాండర్ అమిత్ బాటే ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టరు వైవీరెడ్డి, సిబ్బంది చిన్నబండపల్లెకు చేరుకుని వినాయకం స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు.

అపోలో వర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు

చిత్తూరు రూరల్, జూన్ 25: చిత్తూరులోని అపోలో యూనివర్సిటీకి స్విట్జర్లాండ్, జెనీవాలోని అంతర్జాతీయ మెడికల్ ఇన్ఫర్మాటిక్స్ అసోసియేషన్ గుర్తింపు లభించిందని సంస్థ వైస్ ఛాన్సలర్ వినోద్ భట్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో విద్యార్థులకు వైద్య, సాంకేతిక రంగాలలో అంతర్జాతీయంగా వివిధ ప్రాజెక్టులు చేయడానికి అవకాశం లభిస్తుందన్నారు. వైద్యరంగంలో కృత్రిమ మేధస్సు, వైద్య సమాచారాలను విశ్లేషించుకోవచ్చన్నారు. అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ పోతురాజు, ప్రొఫెసర్ సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన లారీ

25 గొర్రెలు, పొట్టేళ్లు మృతి ● పరారైన లారీని పట్టుకున్న ఆర్టీసీ డ్రైవర్

కల్లూరు, జూన్ 25: పులిచెర్ల మండలం కల్లూరు ఘాట్‌రోడ్డులో మంగళవారం సాయంత్రం గొర్రెల మందపైకి లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో 25 గొర్రెలు, పొట్టేళ్లు మృతిచెందాయి. కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కలకడ మండలం గుడిబండ పాపిగారిపల్లికి చెందిన గొర్రెల యజమానులు ఆనంద, వెంకటేష్, గుణశేఖర్, వెంకటశివ తదితరులు స్వగ్రామం నుంచి నెల క్రితం సుమారు 1000 గొర్రెలను మేత కోసం పూతలపట్టు, పాకాల మండలాలకు తోలుకొచ్చారు. మంగళవారం సాయంత్రం గొర్రెలను మేపుతూ కల్లూరు ఘాట్‌రోడ్డులో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఆ సమయంలో కడప నుంచి రాణిపేటకు సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని అదుపుతప్పి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. దీనిని గమనించిన గొర్రెల యజమానులు తప్పించుకున్నారు. అయితే 25 గొర్రెలు, పొట్టేళ్లు చనిపోయాయి. పలు గొర్రెలకు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ ఆగకుండా వెళ్లిపోగా.. బస్సు డ్రైవర్ దామోదర్ బస్సు దిగి ఓ ద్విచక్ర వాహనంలో లారీని వెంబడించి దామలచెరువు వద్ద పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను మరో ఆర్టీసీ బస్సులో కల్లూరు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన గొర్రెలు, పొట్టేళ్లు

చిన్నబండపల్లిలో 30 మందికి అస్వస్థత

● అంగన్వాడీ సెంటర్‌లోనే వైద్యసేవలు



చికిత్స పొందుతున్న బాధితులు

పూతలపట్టు, జూన్ 25: ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 30 మందికిపైగా అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. పూతలపట్టు మండలం చిన్నబండపల్లిలో 200 కుటుంబాలకు పైగా ఉన్నాయి. చెరువులోని తాగునీటి బోరు నుంచి నీళ్లు సరఫరా అవుతాయి. రెండ్రోజుల క్రితం ఏమైందో గానీ పలువురికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వైద్యాధికారులు గ్రామానికి రాకుండానే ఏఎన్ఎంలు, ఆశావర్కర్లచే వైద్యసేవలు అందించారు. బాధితులను వైద్యసిబ్బంది అంగన్‌వాడీ సెంటర్‌కు తీసుకొచ్చి వైద్యసేవలు అందించడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. కాగా, బాధితుల్లో మౌనిక అనే గర్భిణి సీఎంసీలో.. భూపతి అనే వృద్ధుడు తిరుపతి రుయాలో.. పరిపూర్ణ అనే మహిళ చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు ఏమాత్రం స్పందించలేదంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

స్వర్ణ రథంపై వరసిద్ధుడు

● వైభవంగా సంకటహర గణపతి వ్రతం



స్వర్ణ రథంపై ఊరేగుతున్న వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), జూన్ 25: కాణిపాకంలో మంగళవారం ఉదయం సంకటహర గణపతి వ్రతాన్ని అధికారులు వైభవంగా నిర్వహించారు. సిద్ధి, బుద్ధి సమేత స్వామి వారి ఉత్సవర్లను ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. అనంతరం భక్తుల ఆధ్వర్యంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను స్వర్ణరథంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



పాకాల, జూన్ 25: ఉన్నత చదువు చదివి ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాకాల అదనపు ఎస్ఐ లోకేష్ కుమార్ తెలిపిన ప్రకారం.. సదుంలోని వాల్మీకి వీధికి చెందిన ఎం.కృష్ణయ్య కుమారుడు వెంకటరమణ (24) రెండేళ్ల క్రితం ఏజీబీఎస్సీ పూర్తిచేశాడు. అప్పటినుంచి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఉద్యోగం కోసం వెళ్లొస్తానని బైకుపై వెళ్లాడు. పాకాల మండలం కొమ్మిరెడ్డిగారిపల్లె-వెంకట్రామాపురం మార్గంలోని వల్లివేడు క్రాస్‌రోడ్డు సమీపంలోని మామిడితోటలో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం మామిడితోట యజమాని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఉద్యోగం రాలేదనే వేదనతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతికి టీడీపీ మండలాధ్యక్షుల విరాళం



కుప్పం, జూన్ 25: రాజధాని అమరావతి నిర్మాణానికి టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి రూ.5 లక్షలు, కుప్పం రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఒక లక్ష రూపాయలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళంగా అందించారు. కుప్పంలో జరిగిన బహిరంగ సభలో వారిద్దరూ ఈ విరాళాలను ఆయనకు ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తాను ఎవరినీ అడగకపోయినా ముందుకొచ్చి విరాళాలు ఇస్తున్న దాతలను అభినందించారు.



సగానికి తగ్గిన టమోటా ధరలు

సోమల, జూన్ 25: రైతన్న ఊహించనివిధంగా టమోటా ధరలు మంగళవారం భారీగా తగ్గుముఖం పట్టాయి. 15కిలోల బాక్సు ధర రూ.500, రూ.400లోపు చేరింది. సోమవారం 15కిలోల బాక్సు రూ.600 పలికింది. శని, ఆదివారంలో 15కిలో బాక్సు రూ.950 పలికింది. ఈ నెలలోనే 15కిలోల బాక్సు ధర రూ.300 నుంచి రూ.950 చేరుకుని మళ్లీ తగ్గుముఖం పడుతుండడంతో రైతుల్లో నిరాశ నెలకొంది. సోమల మండలంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో వందల ఎకరాల్లో నాటిన తోటల్లో దిగుబడులు ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ సమయంలో ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రికి పట్టు రైతుల సన్మానం



శాంతిపురం, జూన్ 25: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మండల పట్టు రైతులు వెంకటాద్రి నాయుడు, శంకర్‌రెడ్డిలతోపాటు ఇతర పట్టు రైతులు పట్టుగూళ్ల హారంతో సత్కారం చేశారు. మంగళవారం కుప్పం పర్యటనలో భాగంగా చిన్నారిదొడ్డి వద్ద హంద్రీ-నీవా కాలువ పరిశీలనకు వెళ్లినప్పుడు మండల పట్టు రైతులు అక్కడే చంద్రబాబును సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పట్టు పురుగుల పెంపకానికి అవసరమైన చాకీ పురుగులు దొరకడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో పట్టు పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉదయ్ కుమార్, విజయ రామిరెడ్డి, నాగరాజు, మురళి, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు భారీగా తరలిన జనం



చంద్రబాబు సభలో రామకుప్పం టీడీపీ నేతలు


రామకుప్పం, జూన్ 25: కుప్పంలో మంగళవారం జరిగిన సీఎం చంద్రబాబు బహిరంగసభకు రామకుప్పం మండలం నుంచి భారీ సంఖ్యలో జనం తరలివెళ్లారు. మహిళలు ఎక్కువ సంఖ్యలో వెళ్లారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నకృష్ణ, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, మండల అధ్యక్షుడు వెంకటేశ్, జనసేన మండల అధ్యక్షుడు హరీష్. నాయకులు సీతాపతి, రామ్మూర్తి, కృష్ణానాయక్, జయశంకర్, సత్తి, మహ్మద్‌రఫీ, గంట్లప్పగౌడు, విజయ్‌కుమార్‌రెడ్డి, కొళ్ళుపల్లెబాబు, మనోహర్, చంద్రశేఖర్‌రెడ్డి, నందారెడ్డి, కేశవరెడ్డి, రామకృష్ణప్ప, టీవీరవి, సురేష్, నవీన్, పాండియన్, మురళీ, నాగభూషణం గజేంద్ర తదితరుల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు వెళ్లాయి.

అక్రమ కేసుల నుంచి విముక్తి కల్పించండి

చంద్రబాబుకు టీడీపీ నాయకుల వినతి

రామకుప్పం, జూన్ 25: వైసీపీ అరాచక పాలనలో నమోదు చేసిన అక్రమ కేసుల నుంచి తమకు విముక్తి కల్పించాలని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధికార ప్రతినిధి జయశంకర్, 89 పెద్దూరు యూనిట్ ఇన్‌చార్జ్ గజేంద్ర సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీ నేతల ఒత్తిళ్ళకు తలొగ్గిన పోలీసులు తన కుటుంబసభ్యులపై ఐదేళ్లలో 42 అక్రమ కేసులు కేసులు బనాయించారని జయశంకర్ తెలిపారు. అదేవిధంగా తమ కుటుంబసభ్యులపై 11అక్రమ కేసులు నమోదు చేశారని గజేంద్ర తెలిపారు. అక్రమంగా కేసులు బనాయించి, రౌడీషీట్లు తెరవడమే కాకుండా తమను హతమారుస్తామంటూ పోలీసులు హింసించారని వాపోయారు. మండలంలో సుమారు వందమందిపై అక్రమ కేసులు నమోదయ్యాయని వివరించారు. ఎక్కువగా హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు ఉండటంతో తాము తీవ్ర ఇక్కట్ల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు స్పందించి తమకు అక్రమకేసుల నుంచి విముక్తి కలిగించి, తమపై ఉన్న రౌడీషీట్లు ఎత్తివేయాలని వారు కోరారు.

కుప్పాన్ని స్మార్ట్ సిటీ చేయండి



చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న జగదీశ్‌బాబు

కుప్పం, జూన్ 25: కుప్పం ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని సాయి మాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. ఆయన మంగళవారం కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. మినీ సాఫ్ట్‌వేర్ హైటెక్ సిటీని ఏర్పాటు చేయాలని, సోలార్ పార్క్ భివృద్ధి చేయాలని, రైల్వే స్టేషన్లో పలు రైళ్ల నిలుపుదలకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని, కొత్తపేట, ఆర్.పేట మధ్యలో మినీ ఫ్లైఓవర్ నిర్మించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబును జ్ఞాపికతో సత్కరించారు.





ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య

రొంపిచెర్ల, జూన్25: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందుతోందని ఎంఈవో-2 శ్రీనివాసులు అన్నారు. మంగళవారం బండకిందపల్లె, పెద్దగొట్టిగల్లు పంచాయతీల్లో 'నేను బడికి పోతా' కార్యక్రమం చేపట్టారు. బడిమానేసిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలని కోరారు. రొంపిచెర్ల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

సోమల, జూన్ 25: మండలంలోని కూకటి గొల్లపల్లె పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన కదిరప్ప కుమార్తె యోషిత పుట్టినరోజు సందర్భంగా విద్యాసామగ్రిని అందజేశారు. మంగళవారం పాఠశాలలో వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమణయ్య మాట్లాడుతూ ప్రతి ఏటా విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. టీచర్లు దామోదరం, దాత కుటుంబసభ్యులు సరస్వతి, నరసింహులు, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

పుంగనూరు, జూన్ 25: ప్రజా సమస్యలపై అధికారులు దృష్టిసారించి పరిష్కరించాలని అనంతపురం మున్సిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పుంగమ్మ చెరువు కట్టపై రూ.3 కోట్లతో చేపట్టిన వాకింగ్‌ట్రాక్ పనులు, బెంచీలు, పార్కు పనులను పరిశీలించారు. పనులు త్వరగా నాణ్యతతో పూర్తిచేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, డీఈఈ మహేశ్, ఏఈ కృష్ణకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అధినేతకు ఆహ్వానం



ముఖ్యమంత్రి చంద్రబాబు కోసం వేచి చూస్తున్న పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, సీఆర్ రాజన్

మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు



చౌడేపల్లె, జూన్25: మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డిని ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మణరాజు కలసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన బెంగళూరు విమానాశ్రయంలో మంత్రిని కలసి పూలమాలలు వేసి, శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరాం చినబాబు, ఆర్వీటీ బాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలసిన రాయలసీమ పాఠశాల కరస్పాండెంట్

పుంగనూరు రూరల్, జూన్25: రాష్ట్రరవాణా, క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని పుంగనూరు రాయలసీమ చిల్డ్రన్స్ ఆకాడమీ పాఠశాల కరస్పాండెంట్ చంద్రమోహన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటనకు వెళుతున్న మంత్రిని బెంగళూరు విమానాశ్రమంలో కలసినట్లు ఆయన తెలిపారు.

విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు అభినందనీయం

పుంగనూరు రూరల్, జూన్ 25: రాష్ట్ర ప్రభుత్వం విదేశీవిద్యకు అంబేడ్కర్ పేరు మళ్లీ పెట్టడం అభినందనీయమని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ కొనియాడారు. మంగళవారం ఆయన పుంగనూరులో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విదేశీవిద్య పథకంలో అంబేడ్కర్ పేరు తొలగించగా సీఎం చంద్రబాబు మళ్లీ అంబేడ్కర్ పేరు పెట్టడం అభినందనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో దళిత సంఘనాయకులు శ్రీనివాసులు, నాగరాజ, భాస్కర్, పరమేశ్, ఈశ్వర్, రెడ్డెప్ప, మంజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా పూజలందుకున్న పాలేటమ్మ

సోమల, జూన్ 25: మండలంలోని కందూరు సమీపంలో కొలువుదీరిన పాలేటమ్మవారు ఇంటింటా పూజలందుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తిని మంగళవారం పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి అసాదివారు కల్లు పాట నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఇసుక ట్రాక్టర్ సీజ్

గంగవరం, జూన్ 25: చెన్నారెడ్డిపల్లె సమీపంలోని కన్నెకల చెరువులో ఇసుక లోడింగ్ చేస్తున్న ట్రాక్టర్‌ను గంగవరం పోలీసులు సీజ్ చేశారు. తర్వాత పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా ట్రాక్టర్ స్థానిక వైసీపీ నాయకుడిది అని తెలుస్తోంది.

జ్యోతికి డాక్టరేట్ ప్రదానం




రొంపిచెర్ల, జూన్25: రొంపిచెర్ల పంచాయితీ పాళెం వీధికి చెందిన నాగిశెట్టి నాగరాజ, సుమతిల కుమార్తె నాగిశెట్టి జ్యోతికి తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు విట్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ విజయ కుమార్ గైడెన్స్‌లో గణితంలో 'ఫ్లూయడ్ డైనమిక్స్' అంశంపై జూన్ 2021 - జూన్ నెల 2024 వరకు పరిశోధన చేసింది. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీన తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ వి.సుగుణమ్మ చేతుల మీదుగా విట్ యూని వర్సిటీలో జ్యోతి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆమెను పలువురు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పుంగనూరు రూరల్, జూన్25: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది కోరారు. మంగళవారం ఈడిగపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, వైద్యసిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, టీడీపీ నాయకులు సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేపట్టారు. టీచర్లు ఇస్మాయిల్, రమాదేవి, సచివాలయ సిబ్బంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





గ్రామ పంచాయతీ కార్యాలయం, కాణిపాకం

రి.క.నెం.14/2024 **బహిరంగ వేలము ప్రకటన** తేది : 25-06-2024

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఐరాల మండలం, కాణిపాకం గ్రామపంచాయతీ ప్రతిఫలం ఇచ్చే వసరులైన వారపు సంత, దినసరి సంతలు వేలము 31-03-2024 వ తేదీకి ముగిసినది. తదుపరి వేలము నిర్వహించుటకు సాధారణ ఎన్నికలు 2024 (ఎలెక్షన్ కోడ్) అమలులో వున్నందున శ్రీయుత జిల్లా పంచాయతీ అధికారి, చిత్తూరు వారి ఆదేశాల మేరకు 26/03/2024 వ తేదీన జరగవలసిన వేలము నిలిపివేయడమైనది. ప్రస్తుతము 06/06/2024 వ తేదీ నాటికి ఎలెక్షన్ కోడ్ ముగిసినందున వారపు సంత, దినసరి సంతలు వేలము 03-07-2024 నుండి 31-03-2025 వరకు రుసుములు వసూలు చేసుకొను గుత్త హక్కు ను పొందుటకు గాను 03.07.2024 వ తేదీమధ్యాహ్నం 03.00 గంటల కాణిపాకం గ్రామపంచాయతీ కార్యాలయము నందు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

వ.నెం.	వివరములు	చెల్లించవలసిన డిపాజిట్	సాల్వేన్సీ మొత్తం	సాల్వేన్సీ లేని వారు చెల్లించవలసిన డిపాజిట్
1	దినసరి సంత	50,000/-	50,000/-	1,00,000/-
2	వారపు సంత	50,000/-	50,000/-	1,00,000/-

షరతులు : 1) సదరు బహిరంగ వేలము నందు హెచ్చు పాట ఏదైతే దానినే పరిగణలోనికి తీసుకొనబడును. 2) హెచ్చు పాటదారుడు వేలము ముగిసిన మూడు రోజుల లోపుగా డిపాజిట్ పోను మిగిలిన మొత్తమును డిమాండు డ్రాఫ్ట్, చలాన రూపములో పంచాయతీ ఖాతాకు చెల్లించవలయును. 3) డిపాజిట్లు పంచాయతి కార్యదర్శి, కాణిపాకం వారి పేరు మీద జాతీయ బ్యాంకులు నుండి డిమాండు డ్రాఫ్ట్‌గా తీసుకొని, కాణిపాకం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీ నందు చెల్లుబాటు అయ్యే విధముగా వేలమునకు ముందుగా అందజేయవలయును. 4) వేలములో పాల్గొనదలచినవారు గ్రామపంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదు. 5) అట్లు బకాయిలు వున్నవారు వేలము నందు పాల్గొనుటకు అనర్హులు. మరియు సివిల్, క్రిమినల్ నేరము క్రింద శిక్షించబడిన వారు వేలము నందు పాల్గొనుటకు అనర్హులు. ఏ కారణములు తెలుపకనే వేలమును రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు పంచాయతీ కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు. 6) వేలములు ఖాయపరచుట గ్రామపంచాయతీ వారి ఆమోదమునకు లోబడి యుండును. 7) హెచ్చు పాట దారుడు గ్రామ పంచాయతీ నోటిఫికేషన్ లోని నిబంధనలు మరియు 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతి రాజ్ చట్టము లోని సెక్షన్ 32,63(3),107 మరియు 115 లకు సంబంధించిన ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించరాదు. 8) వారపు సంత, దినసరి సంతలు వేలము వసూలు రేట్లు వివరములు షరతులు మరియు ఇతర విషయములు కార్యాలయపు పనివేళల యందు తెలుసుకొనవచ్చు.

శ్రీ యం. సత్యం రెడ్డి
పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ,
కాణిపాకం. ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

శ్రీ కె.యస్.శాంతి సాగర్ రెడ్డి
సర్పంచ్, కాణిపాకం గ్రామ పంచాయతీ,
ఐరాల (మం),చిత్తూరు జిల్లా.


ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య

రొంపిచెర్ల, జూన్25: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందుతోందని ఎంఈవో-2 శ్రీనివాసులు అన్నారు. మంగళవారం బండ కిందపల్లె, పెద్దగొట్టిగల్లు పరాయతీల్లో 'నేను బడికి పోతా' కార్యక్రమం చేపట్టారు. బడిమానేసిన విద్యార్థుల మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలని కోరారు.

విద్యా సామగ్రి వితరణ

సోమల, జూన్ 25: మండలంలోని కూకటి గొల్లపల్లె పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన కదిరప్ప కుమార్తె యోషిత పుట్టినరోజు సందర్భంగా మంగళవారం విద్యా సామగ్రిని అంద జేశారు













డయేరియా రాకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు, జూన్ 25: వర్షాలు కురుస్తున్న కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు డయేరియా సోకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో భాస్కర్, గంగాధరనెల్లూరు, తూగుండ్రం డాక్టర్లు దుర్గాదేవి, లిఖితలు కోరారు. మండల పరిషత్ ఆఫీస్‌లో పంచాయతీకార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లతో అధికారులు సమీక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 1 నుండి ఆగస్టు 31 తేదీవరకు సిబ్బంది డయేరియా కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి ట్యాంకుల ద్వారా కొళాయిలు, ఇళ్ల కొళాయిపైపులు విరిగిపోయి డ్రైనేజి నీరు కలిసిపోతే ప్రజలకు వాంతులు, విరోచనాలు వచ్చే అవకాశముందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల ఉత్పత్తి పెరగకుండా మురుగునీటి గుంటలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈవోపీఆర్డీ రాఘవేంద్రరాజు, సీహెచ్‌వో శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంగీత పాల్గొన్నారు.

విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు అభినందనీయం

పుంగనూరు రూరల్, జూన్ 25: రాష్ట్ర ప్రభుత్వం విదేశీవిద్యకు అంబేడ్కర్ పేరు మళ్లీ పెట్టడం అభినందనీయమని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ కొనియాడారు. మంగళవారం ఆయన పుంగనూరులో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విదేశీవిద్య పథకంలో అంబేడ్కర్ పేరు తొలగించగా సీఎం చంద్రబాబు మళ్లీ అంబేడ్కర్ పేరు పెట్టడం అభినందనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో దళిత సంఘనాయకులు శ్రీనివాసులు, నాగరాజ, భాస్కర్, పరమేశ్, ఈశ్వర్, రెడ్డెప్ప, మంజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా పూజలందుకున్న పాలేటమ్మ

సోమల, జూన్ 25: మండలంలోని కందూరు సమీపంలో కొలువుదీరిన పాలేటమ్మవారు ఇంటింటా పూజలందుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తిని మంగళవారం పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి అసాదివారు కల్లు పాట నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గంగవరం, జూన్ 25: చెన్నారెడ్డిపల్లె సమీపంలోని కన్నెకల చెరువులో ఇసుక లోడింగ్ చేస్తున్న ట్రాక్టర్‌ను గంగవరం పోలీసులు సీజ్ చేశారు. తర్వాత పోలీసు స్టేషన్ కు తరలించారు. కాగా ట్రాక్టర్ స్థానిక వైసీపీ నాయకుడిది అని తెలుస్తోంది.

కేసుల నుంచి విముక్తి కల్పించండి

రామకుప్పం, జూన్ 25: వైసీపీ అరాచక పాలనలో నమోదు చేసిన అక్రమ కేసుల నుంచి తమకు విముక్తి కల్పించాలని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి జయశంకర్, 89 పెద్దూరు యూనిట్ ఇన్‌చార్జీ గజేంద్ర సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు తన కుటుంబ సభ్యులపై ఐదేళ్లలో 42 అక్రమ కేసులు కేసులు బనాయించారని జయశంకర్ తెలిపారు. అదేవిధంగా తమ కుటుంబ సభ్యులపై 11అక్రమ కేసులు నమోదు చేశారని గజేంద్ర తెలిపారు. అక్రమంగా కేసులు బనాయించి, రౌడీ షీట్లు తెరవడమే కాకుండా తమను హతమారుస్తామంటూ పోలీసులు హింసించారని వాపోయారు. వంద మందిపై అక్రమ కేసులు నమోదయ్యాయని వివరించారు. హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు ఉండటంతో తాము ఇక్కట్ల పాలయ్యామన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెసర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, చిత్తూరు బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి చిత్తూరు జిల్లా, యాదమరి మండలం, కుర్మలపల్లి పోస్టు, కమ్మరాయనిమిట్ట గ్రామంలో డో.నెం. 1-67లో యుండు కె.దొరస్వామి రెడ్డి గారి కుమారుడు కె.మహేష్ బాబు గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు మహేష్ బాబు గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి జప్తులు, దార్లీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 4 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు : చిత్తూరు డిస్ట్రిక్టు, చిత్తూరు సబ్ - డిస్ట్రిక్టు, చిత్తూరు జిల్లా ప్రజాపరిషత్తు, యాదమరి మండలము, కొణాపల్లి పంచాయతి, కొణాపల్లె గ్రామం లెక్క దాఖలా సర్కారు పుంజ, సర్వే నెం. 25-3బిగా యుండి ప్రస్తుతము సబ్ డివిజన్ కాబడిన మేరకు సర్వే నెం 25-3బి/1 పూరా విస్తీర్ణము ఎ. 1.48 సెంట్లు గల భూమిలో సదరు కమ్మరాయని మిట్ట గ్రామములో పంచాయతీ డోర్ నెం. 1-87గా గల ఆర్.సి.సి. మిద్దె ఇంటికి, రేకుల షెడ్డు జాగాకు చెక్కుబంది కొలతల వివరము : తూర్పు - సర్వే నెం. 25-2బి గల భూమిలో కే. ప్రభాకర రెడ్డి గారి భూమి, పడమర : సర్వే నెం. 24-2గల భూమి, ఉత్తరము బండి బాట, దక్షిణము : సుబ్బారెడ్డి గారి భూమి.ఈ మధ్య విస్తీర్ణము 0.98 సెంట్లు లేక 0.396 హెక్టార్లు ఇందుకు సమాన విస్తీర్ణము 42,679 చదరపు అడుగులు లేక 4743.2 చదరపు గజములు గల జాగా పూరా, ఈ జాగాలో 600 చదరపు అడుగులు విస్తీర్ణములో గల ఆర్.సి.సి. మిద్దెఇంటికి, రేకుల షెడ్డు పూరా ఈ ఇండ్లకు అమర్చిన యావత్ పరికరములతో సహా

కె.ప్రవీణ్, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్,
డో.నెం. 10-115, గాంధీ రోడ్ ఎక్స్‌టెన్షన్, చిత్తూరు సెల్ : 9550134756

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెసర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, చిత్తూరు బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి యాదమరి మండలం, యాదమరి పోస్టు, యాదమరి గ్రామం, శివసాయి నగర్, డో.నెం.1-216 గల ఇంటిలో యుండు పి.వరదరాజులు గారి భార్య శ్రీమతి పి.మాధవి గారికి చెందినదనియు సదరు మాధవి గారికి చెందిన ఆస్తిని ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని పి.వరదరాజులు గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి జప్తులు, దార్లీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 4 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు : చిత్తూరు డిస్ట్రిక్టు - చిత్తూరు సబ్ డిస్ట్రిక్టు - యాదమరి మండలం - యాదమరి గ్రామ పంచాయతి.. యాదమరి గ్రామం లెక్క దాఖలా సర్కారు పుంజ సర్వేనెం. 86-22ఏ విస్తీర్ణం ఎ 0.03 సెంట్లు, సర్కారు పుంజ సర్వేనెం. 86-5 విస్తీర్ణం ఎ 0.17 సెంట్లు గల భూములలో నా స్వాధీనానుభవములో యుండి ఈ దినం నీకు ఉచితముగా యిచ్చి నీ స్వాధీనం చేయు డోర్ నెం. 1-216 Assessment No 4816 గాగల ఆర్‌సిసి మిద్దె ఇల్లు, ఖాళీ జాగాకు చెక్కు బంది కొలతల వివరము. తూర్పు : ఆర్.వెంకటరమణారెడ్డి వగైరాలు వదలి యుండు 20 అడుగులు వెడల్పు గల రోడ్డు, పడమర : ఆర్.వెంకటరమణారెడ్డి వగైరాలు నిలుపుకొన్న ప్లాటు నెం. 16 జాగా ఉత్తరం : ఆర్.వెంకటరమణారెడ్డి వగైరాలు నిలుపుకొన్న ప్లాట్నెం.3 జాగా దక్షిణం: సి. గోపాల్ గారి జాగా ఈ మధ్య తూర్పు పడమర 55 అడుగులు లేక 16.775 మీటర్లు ఉత్తర దక్షిణం 26.1/2 అడుగులు లేక 8.803 మీటర్లు ఈ కొలతల మధ్య 1457.1/2 చ.అడుగులు లేక 162 చ. గజములు గల జాగా పూరా. ఈ జాగాలో తూ.ప 35 అ X ఉ. 20 అ వ 700 చ.అడుగులలో నిర్మించి యుండు Ground Floor RCC మిద్దె ఇల్లు పూరా. ఇందుకు పైభాగమున తూ.ప 10 X ఉ.ద 10 అ = 100 చ. అడుగులలో నిర్మించి యుండు First Floor RCC మిద్దె ఇల్లు పూరా. ఈ ఇంటికి అమర్చియుండు తలుపులు ద్వారబంధనములు కిటికీలు అల్మైరాలు అడుగునేల పై కప్పు తో సహా ఈ ఇంటికి ఫిట్టింగ్ చేసి యుండు ఎలక్ట్రికల్ సర్వీసు కనెక్షన్ నెం.5611217001579 వాయర్లు బల్బులు స్విచ్చులు డిపాజిట్లు వగైరాలు పూరా.

కె.ప్రవీణ్, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్,
డో.నెం. 10-115, గాంధీ రోడ్ ఎక్స్‌టెన్షన్, చిత్తూరు సెల్ : 9550134756






స్వాగతం - సుస్వాగతం
శ్రీ గురజాల జగన్‌మోహన్
శాసన సభ్యులు, చిత్తూరు
శ్రీ పులివర్తి నాని
శాసన సభ్యులు, చంద్రగిరి
శ్రీ ఎన్.అమరనాథ రెడ్డి
శాసన సభ్యులు, పలమనేరు
శ్రీ వి.ఎం.థామస్
శాసన సభ్యులు, గంగాధర నెల్లూరు
శ్రీ కె.మురళీ మోహన్
శాసన సభ్యులు, పూతలపట్టు
శ్రీ గాలి భానుప్రకాష్
శాసన సభ్యులు, నగరి
శ్రీ దగుమళ్ళ ప్రసాద్‌రావు
పార్లమెంట్ సభ్యులు, చిత్తూరు
ప్రపంచ దేశాలు మెచ్చిన నాయకులు, అమరావతి రూపశిల్పి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి ప్రప్రథమంగా కుప్పం పర్యటనకు విచ్చేసిన సందర్భంగా మా హార్థిక స్వాగత - సుస్వాగతం. చిత్తూరు పార్లమెంటు పరిధిలో శాసన సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన శాసనసభ్యులకు మా హార్థిక శుభాకాంక్షలు.
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
కె.మురళీ
మురళీ గ్రానైట్స్
చిత్తూరు, పెనుమూరు
టి.సుధాకర్ బాబు
కావేరి గ్రానైట్స్, ఆర్.ఆర్. గ్రానైట్స్
చిత్తూరు
తుమ్మల శ్రీనివాసులునాయుడు
బాలాజి గ్రానైట్స్, గంగాసాగరం
కె.మధుసూధన రావు
ఎస్.ఆర్.ఎం. గ్రానైట్స్, చిత్తూరు
టి.దుర్గాప్రసాద్
ఆదిత్య గ్రానైట్స్, గంగాసాగరం
అనంద నాయుడు
మల్లీశ్వరీ గ్రానైట్స్
వెంగారెడ్డిపల్లి
చంద్రన్
మంజుల గ్రానైట్, పొానై
ఎం.శేఖర్
శ్రీ సాయి లక్ష్మీ గ్రానైట్స్,
కమ్మరాయనిమిట్ట, చిత్తూరు
ఎం.ప్రకాష్
శ్రీ దుర్గా గ్రానైట్స్,
కలవగుంట
అమిలినేని ద్వారక నాయుడు
శ్రీ జ్యోతి గ్రానైట్, ముత్తుకూరు
తేజ
జయంతి గ్రానైట్స్
బంగారెడ్డిపల్లి
జి.ప్రవీణ్ కుమార్
జి.జె.ఎన్. గ్రానైట్స్
బంగారెడ్డిపల్లి
చిత్తూరు జిల్లా గ్రానైట్స్ పరిశ్రమలు మరియు క్వారీ యాజమానులు





హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ - అనంతపురం ఇన్‌చార్జి డీఐజీ షెముషి - ఎస్పీ మణికంఠ

సీఎం నేటి షెడ్యూల్ ఇలా..

ఉదయం 10.30 గంటలు: ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ప్రజలనుంచి వినతుల స్వీకరణ

మధ్యాహ్నం 12.00: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కుప్పం నియోజకవర్గ అధికారులతో సమీక్ష

2.35: పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో టీడీపీ నియోజకవర్గ సమావేశం

సాయంత్రం 4.10: పీఈఎస్ వైద్య కళాశాల హెలిప్యాడ్‌నుంచి బెంగళూరుకు పయనం

'అమరావతి'కి విరాళాలు

రాజధాని అమరావతి అభివృద్ధికి మహిళా సంఘాల తరపున రూ.4.5కోట్ల విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేశారు. టీడీపీ రామకుప్పం మండల శాఖ తరపున పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి రూ.5 లక్షలు, కుప్పం రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ రూ.లక్ష చెక్కులు అందించారు.

కుప్పం రుణం తీర్చుకుంటా

మండలాలుగా మల్లానూరు, రాళ్లబూదుగూరు ● ఏడాదిలో హంద్రీనీవా జలాలు ● పాలారునదిపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం ● ఉద్యాన పంటల మార్కెటింగ్ కార్గో విమానాశ్రయం ● ద్రావిడ వర్సిటీ ప్రక్షాళన చేస్తా ● సీఎం చంద్రబాబు వరాల జల్లు

కుప్పం, జూన్ 25: తనను ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి, నాలుగుసార్లు సీఎం కావడానికి అవకాశం ఇచ్చిన కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట మంగళవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

రైతుల కోసం..

కుప్పంలో వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పువ్వులు విస్తారంగా పండుతాయి. వీటి మార్కెటింగ్ కోసం కార్గో విమానాశ్రయాన్ని స్థాపించి, బెంగళూరు, కృష్ణగిరి, చెన్నై, కేజీఎఫ్‌తోపాటు విదేశాలకు ఎగుమతి చేసి రైతులు లాభాలు గడించేలా చర్యలు తీసుకుంటా. కుప్పం మార్కెట్ యార్డులో సగంలో ఆగిపోయిన కోల్డ్ స్టోరేజీ భవనాన్ని పూర్తి చేస్తా. అన్ని మండల కేంద్రాల్లోనూ మినీ కోల్డ్ స్టోరేజీ భవనాలను నిర్మిస్తా. పట్టు, వ్యవసాయ పరిశ్రమలకు అవసరమైన సబ్సిడీలు, ప్రయోజనాలు అందిస్తా. తద్వారా రైతులు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటా.

సాగునీటికి ప్రాధాన్యం

నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వి.కోట దాకా హంద్రీనీవా జలాలు తీసుకొచ్చా. ఎన్నికల ముందు జగన్ వచ్చి సినిమా సెట్టింగ్ వేసి డ్రామా చేసేసి వెళ్లారు. నేను 80 శాతం పని పూర్తి చేస్తే మిగిలిన 20 శాతం పని కూడా చేయలేదు. నేను కచ్చితంగా కాలువ నిర్మాణం పూర్తి చేసి కృష్ణా జలాలను ఏడాదిలోగా తీసుకొస్తాను. అన్ని చెరువులను నింపుతాను. సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తాను. ఇక, మనం అధికారంలో ఉన్న సమయంలో పాలారు నదిపై చెక్ డ్యామ్‌లు నిర్మించాం. ఇప్పుడు మళ్లీ వీలైనన్ని చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తా. గుడుపల్లె మండలం యామనూరు, శాంతిపురం మండలం ప్రీతిచామనూరు గ్రామాల సమీపంలో ప్రతిపాదిత రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి వీలైనంత త్వరలో పూర్తి చేస్తాను.

మళ్లీ కడా

ఈ ఐదేళ్లుగా కుప్పంపై జగన్ కక్షగట్టాడు. విధ్వంసం సృష్టించాడు. మళ్లీ సరిచేస్తా. ఈ పతనానికి కారణమైన అందరి లెక్కలు తేలుస్తా. మళ్లీ కడా (కుప్పం పట్టణాభివృద్ధి సంస్థ)ను ఏర్పాటు చేసి నాలుగు మండలాల్లో అభివృద్ధి పనులు చేపడతా. ప్రతి మండల కేంద్రాన్ని రూ.10 కోట్లతో గ్రీన్ టౌన్‌గా అభివృద్ధి చేస్తా. పంచాయతీల స్థాయిని బట్టి రూ.కోటి నుంచి రూ.2 కోట్లతో పనులు చేపడతా. మల్లానూరు, రాళ్లబూదుగూరును కూడా మండలాలుగా చేస్తా.

యువత కోసం..

కుప్పంలో ఎక్కువగా పండే టమోటాకు అనుబంధంగా కెచప్, జ్యూస్ పరిశ్రమలను నెలకొల్పుతా. టెక్స్‌టైల్స్, సాఫ్ట్‌వేర్ కంపెనీల ఫ్రాంచైజీల స్థాపనకు చర్యలు తీసుకుని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా.

ద్రావిడ వర్సిటీని గాడిలో పెడతా

ఈ ఐదేళ్లలో ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని భ్రష్టు పట్టించారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి విధ్వంసం చేశారు. దాన్ని గాడిలో పెడతాను. 254 మంది సిబ్బంది 10 నెలలుగా వేతనాలు లేకుండా ఇబ్బంది పడుతున్నారు. వారందరికి వెంటనే జీతాలు రిలీజ్ చేస్తాను.

రౌడీలకు హెచ్చరిక

కుప్పంలో ఎవరైనా రౌడీయిజాన్ని చేయాలని చూస్తే అదే వాళ్లకు చివరి రోజు అవుతుంది. ప్రశాంతంగా ఉన్న కుప్పంలో అలజడి సృష్టిస్తే సహించేది లేదు. రామకుప్పంలో గంజాయి సాగు అధికమైంది. కుప్పాన్ని గంజాయి స్మగ్లింగ్ కేంద్రంగా మార్చేశారు. దీనిని గంజాయి రహిత నియోజకవర్గంగా తయారు చేస్తా.



శాంతిపురం మండలం కడపల్లె వద్ద తన ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు నాయుడు

ఇంకా ఏం చేస్తానంటే..

- ఎక్కడికక్కడ ఆగిపోయిన వివిధ కులాలకు చెందిన కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తా. సభలు, సమావేశాలు, పెళ్లిళ్లు, పేరంటాళ్లకు అనువుగా తీర్చిదిద్దుతా.
- ఆర్టీసీ డిపోకు ఇంకా అవసరమైన బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు, ఏసీ బస్సులు తెస్తాను. అత్యాధునిక సౌకర్యాలతో మోడల్ డిపోగా తీర్చిదిద్దుతాను.
- కుప్పం చుట్టూ అవుటర్ రింగ్ రోడ్డు పూర్తి చేస్తా. రింగ్ రోడ్డు నుంచి పల్లెలను కలుపుకుంటూ తమిళనాడు కృష్ణగిరి, కర్ణాటక కేజీఎఫ్‌లను అనుసంధానం చేస్తా. బెంగళూరునుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్ హైవేకి లింకేజ్ పెట్టి, కుప్పంనుంచే ఇటు బెంగళూరు, అటు చెన్నైకి గంటలో చేరేలా చర్యలు చేపడతా.
- కుప్పం మండలంలోని బేటరాయస్వామి కొండ, గుడుపల్లె మండలం మల్లప్పకొండ, యామగానిపల్లె ధర్మరాజుల దేవాలయం, శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు కోదండరామస్వామి దేవాలయంతో పాటు పల్లెల్లోని మరో 100-150 ఆలయాలను అభివృద్ధి చేస్తా.
- ఈ అయిదేళ్లలో మూలనపడ్డ ఎన్టీఆర్ సుజల ప్లాంట్లను మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకొస్తాను. నియోజకవర్గ ప్రజలకు శుద్ధ జలం అందిస్తా.

మీ తీరువల్లే..

● టీడీపీ సమన్వయ కమిటీ భేటీలో చంద్రబాబు అసహనం

కుప్పం, జూన్ 25: పనిచేసే వాళ్లను పక్కనపెట్టి, షో చేసేవాళ్లను ముందుకు తోయడం వల్లే మొన్న ఎన్నికల్లో మెజారిటీ తగ్గిందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నేతలపై అసహనం వ్యక్తం చేశారు. కుప్పంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంగళవారం సాయంత్రం ఆయన నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీతో సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఎన్నికల్లో తనకు లభించిన 48 వేల ఓట్ల మెజారిటీపై చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాష్ట్రమంతటా ఒక ప్రభంజనంలా టీడీపీకి ఓట్లు పడి, అత్యధిక ఓట్లతోపాటు, సీట్లతో అధికారంలోకి రావడం.. చాలాచోట్ల 80 వేల నుంచి 95 వేల మెజారిటీలు వచ్చాయని గుర్తు చేశారు. పదేపదే చెబుతున్నా, టీమ్‌ను మార్చినా మెజారిటీ ఎందుకు పెరగలేదని నాయకులను నిలదీశారు. ప్రజలతో మమేకం కావాల్సినంతగా కాలేదని, క్షేత్రస్థాయి పరిస్థితులను బేరీజువేసి పనిచేసేవారెవరో, చేయని వారెవరో నిర్ధారించుకోవడంలో తప్పటడుగులు పడ్డాయని అన్నారు. ఇదే తీరుతో వ్యవహరిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక మీదటైనా కష్టపడేవారిని గుర్తించి బాధ్యతలు అప్పగించాలని, ఆ పని తానే చేస్తానని అన్నారు. ఎక్కడా పొరబాట్లు జరగకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా పర్యవేక్షించాలని పార్టీ శ్రేణులకు జాగ్రత్తలు చెప్పారు. కొందరు మండల అధ్యక్షులు, నాయకులు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

హంద్రీ- నీవా కాలువ సందర్శన

శాంతిపురం, జూన్ 25: శాంతిపురం మండలం జల్లిగానిపల్లె, చిన్నారిదొడ్డి గ్రామాల సమీపంలోని హంద్రీ నీవా కాలువను మంగళవారం సీఎం చంద్రబాబు పరిశీలించారు. అక్కడే అధికారులతో సమీక్షించారు. ఈ కాలువ వద్ద సుమారు 30 నిమిషాలు గడిపారు. వెంట అధికారులు మాత్రమే ఉన్నారు తప్ప, పార్టీ నాయకులు లేరు.

సీఎం దృష్టికి 'వి.కోట బైపాస్'

● తూర్పు వైపు రోడ్డు వేయిస్తామని చంద్రబాబు హామీ

వి.కోట, జూన్ 25: కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు దృష్టికి వి.కోట బైపాస్ అంశాన్ని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు తీసుకెళ్లారు. టీడీపీ హయంలో తూర్పు వైపున రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపితే గత వైసీపీ ప్రభుత్వం కర్ణాటక మీదుగా ప్రతిపాదించిందని వివరించారు. రైతులు హైకోర్టును ఆశ్రయించగా.. కర్ణాటక, ఇటు ప్రాంతాల్లో జరుగుతున్న భూసేకరణ పనులు ఆపాలని కోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. వి.కోట అభివృద్ధి దృష్ట్యా తూర్పు వైపునే బైపాస్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని సీఎం వారికి హామీ ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, నేతలు సోమశేఖర్, శబరీష్, షేక్‌ఉమ్మర్, విశ్వనాథ్, జనార్దన్‌రెడ్డి, రమేష్, రామూర్తిఆచ్చారి, భక్తా, షణ్ముగం, గుణశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సీఎంతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్




హెలిప్యాడ్ వద్ద మాజీ ఎమ్మెల్సీ గౌనివారిని అడ్డుకున్న రోప్‌పార్టీ పోలీసులు - హెలిప్యాడ్‌లోకి అనుమతులు లేవనడంతో వేచి ఉన్న మాజీ ఎమ్మెల్యే సీకే బాబు

పోలీసుల అత్యుత్సాహం


● టీడీపీ శ్రేణులను అడ్డుకున్న బలగాలు

కుప్పం/వి.కోట, జూన్ 25: చంద్రబాబు పర్యటనలో పోలీసులు అత్యుత్సాహం కనబరిచారు. పీఈఎస్ ఆస్పత్రిలోని హెలిప్యాడ్ వద్దకు వెళుతున్న టీడీపీ నేతలను అడ్డుకోవడంతో వారు అసహనం వ్యక్తం చేశారు. తనకు పాస్ ఉందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు చూపినా రోప్‌పార్టీ అడ్డుకుంది. దీన్ని గమనించిన ఏఎస్పీ రోప్‌పార్టీని వారించి ఆయన్ను లోపలు పంపారు. చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు తదితర పేర్లు జాబితాలో లేవని ఆపేశారు. అదే సమయంలో అటు వచ్చిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయన్ను లోపలకు తీసుకెళ్లారు. శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం, కుప్పం మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులను, నియోజక వర్గ తెలుగు మహిళలనూ అనుమతించక పోవడంతో వారు వాగ్వాదానికి దిగి కన్నీళ్ళపర్యంతమయ్యారు. చంద్రబాబు వచ్చేటప్పటికి ఇద్దరు యువకులు ప్రహరీ దూకి హెలిప్యాడ్ వద్దకు పరుగులు తీయగా పోలీసు సిబ్బంది వెంటపడి బయటకు పంపేశారు. తన పర్యటనలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది పెట్టొద్దని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినా, కుప్పంలో మాత్రం పట్టణంలోకి వెళ్ళి, వచ్చే మార్గాలను పోలీసులు మూసేయడం సరి కాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



హెలిప్యాడ్‌లోకి దూకి వెళుతున్న యువకులను బయటకు లాగేస్తున్న పోలీసులు

వినాయకంకు ఘన నివాళులు



పూతలపట్టు, జూన్ 25: వరదల్లో చిక్కుకున్న పలువురిని కాపాడేందుకు వెళ్లి మృతి చెందిన మిలటరీ ఉద్యోగి వినాయకంకు ఐటీబీపీ అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు. పూతలపట్టు మండలం చిన్నబండపల్లెకు చెందిన వినాయకం(32) ఐటీబీపీలో ఉద్యోగం చేస్తూ 2023 జూన్ 25న ఉత్తరాఖండ్‌లో వరదలు రాగా భక్తులను రక్షించేందుకు హెలికాప్టరులో వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ సంఘటన జరిగి ఏడాదైన సందర్భంగా మంగళవారం ఐటీబీపీ కమాండర్ అమిత్ బాటే ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టరు వైవీరెడ్డి, సిబ్బంది చిన్నబండపల్లెకు చేరుకుని వినాయకం స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు.

అపోలో వర్సిటీకి అంతర్జాతీయ గుర్తింపు

చిత్తూరు రూరల్, జూన్ 25: చిత్తూరులోని అపోలో యూనివర్సిటీకి స్విట్జర్లాండ్, జెనీవాలోని అంతర్జాతీయ మెడికల్ ఇన్ఫర్మాటిక్స్ అసోసియేషన్ గుర్తింపు లభించిందని సంస్థ వైస్ ఛాన్సలర్ వినోద్ భట్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో విద్యార్థులకు వైద్య, సాంకేతిక రంగాలలో అంతర్జాతీయంగా వివిధ ప్రాజెక్టులు చేయడానికి అవకాశం లభిస్తుందన్నారు. వైద్యరంగంలో కృత్రిమ మేధస్సు, వైద్య సమాచారాలను విశ్లేషించుకోవచ్చన్నారు. అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ పోతురాజు, ప్రొఫెసర్ సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన లారీ

25 గొర్రెలు, పొట్టేళ్లు మృతి ● పరారైన లారీని పట్టుకున్న ఆర్టీసీ డ్రైవర్

కల్లూరు, జూన్ 25: పులిచెర్ల మండలం కల్లూరు ఘాట్‌రోడ్డులో మంగళవారం సాయంత్రం గొర్రెల మందపైకి లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో 25 గొర్రెలు, పొట్టేళ్లు మృతిచెందాయి. కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కలకడ మండలం గుడిబండ పాపిగారిపల్లికి చెందిన గొర్రెల యజమానులు ఆనంద, వెంకటేష్, గుణశేఖర్, వెంకటశివ తదితరులు స్వగ్రామం నుంచి నెల క్రితం సుమారు 1000 గొర్రెలను మేత కోసం పూతలపట్టు, పాకాల మండలాలకు తోలుకొచ్చారు. మంగళవారం సాయంత్రం గొర్రెలను మేపుతూ కల్లూరు ఘాట్‌రోడ్డులో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఆ సమయంలో కడప నుంచి రాణిపేటకు సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని అదుపుతప్పి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. దీనిని గమనించిన గొర్రెల యజమానులు తప్పించుకున్నారు. అయితే 25 గొర్రెలు, పొట్టేళ్లు చనిపోయాయి. పలు గొర్రెలకు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ ఆగకుండా వెళ్లిపోగా.. బస్సు డ్రైవర్ దామోదర్ బస్సు దిగి ఓ ద్విచక్ర వాహనంలో లారీని వెంబడించి దామలచెరువు వద్ద పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను మరో ఆర్టీసీ బస్సులో కల్లూరు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన గొర్రెలు, పొట్టేళ్లు

చిన్నబండపల్లిలో 30 మందికి అస్వస్థత

● అంగన్వాడీ సెంటర్‌లోనే వైద్యసేవలు



చికిత్స పొందుతున్న బాధితులు

పూతలపట్టు, జూన్ 25: ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 30 మందికిపైగా అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. పూతలపట్టు మండలం చిన్నబండపల్లిలో 200 కుటుంబాలకు పైగా ఉన్నాయి. చెరువులోని తాగునీటి బోరు నుంచి నీళ్లు సరఫరా అవుతాయి. రెండ్రోజుల క్రితం ఏమైందో గానీ పలువురికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వైద్యాధికారులు గ్రామానికి రాకుండానే ఏఎన్ఎంలు, ఆశావర్కర్లచే వైద్యసేవలు అందించారు. బాధితులను వైద్యసిబ్బంది అంగన్‌వాడీ సెంటర్‌కు తీసుకొచ్చి వైద్యసేవలు అందించడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. కాగా, బాధితుల్లో మౌనిక అనే గర్భిణి సీఎంసీలో.. భూపతి అనే వృద్ధుడు తిరుపతి రుయాలో.. పరిపూర్ణ అనే మహిళ చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు ఏమాత్రం స్పందించలేదంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

స్వర్ణ రథంపై వరసిద్ధుడు

● వైభవంగా సంకటహర గణపతి వ్రతం



స్వర్ణ రథంపై ఊరేగుతున్న వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), జూన్ 25: కాణిపాకంలో మంగళవారం ఉదయం సంకటహర గణపతి వ్రతాన్ని అధికారులు వైభవంగా నిర్వహించారు. సిద్ధి, బుద్ధి సమేత స్వామి వారి ఉత్సవర్లను ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. అనంతరం భక్తుల ఆధ్వర్యంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను స్వర్ణరథంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



పాకాల, జూన్ 25: ఉన్నత చదువు చదివి ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాకాల అదనపు ఎస్‌ఐ లోకేష్ కుమార్ తెలిపిన ప్రకారం.. సదుంలోని వాల్మీకి వీధికి చెందిన ఎం.కృష్ణయ్య కుమారుడు వెంకటరమణ (24) రెండేళ్ల క్రితం ఏజీబీఎస్సీ పూర్తిచేశాడు. అప్పటినుంచి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఉద్యోగం కోసం వెళ్లొస్తానని బైకుపై వెళ్లాడు. పాకాల మండలం కొమ్మిరెడ్డిగారిపల్లె-వెంకట్రామాపురం మార్గంలోని వల్లివేడు క్రాస్‌రోడ్డు సమీపంలోని మామిడితోటలో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం మామిడితోట యజమాని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఉద్యోగం రాలేదనే వేదనతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరంతర శ్రమతో లక్ష్యసాధన

● జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజరు



విద్యార్థులకు సూచనలిస్తున్న మోహన్‌కుమార్, మాధవి,తదితరులు

విజయపురం, జూన్ 25: విద్యార్థులు మంచి పౌరులుగా దేశాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజరు మోహన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మాధవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి లక్ష్యాన్ని ఎంచుకొని సాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. యువజనుల కోసంకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోజం చేసుకోవాలన్నారు. ఇంప్యాక్ట్ సీనియర్ ట్రైనర్ మాధవి, కళాశాల ప్రిన్సిపాల్ లలిత, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహమూర్తి సేవలు మరువలేనివి



నరసింహమూర్తిని సన్మానిస్తున్న అధికారులు

గుడిపాల, జూన్ 25: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసిన నరసింహమూర్తి సేవలు మరువలేనివని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం గుడిపాల పీహెచ్‌సీలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీనివాసులు మాట్లాడుతూ నరసింహమూర్తి వివిధ మండలాల్లో సుమారు 40 ఏళ్లపాటు మచ్చలేని మనిషిగా పేరుపొందారని కొనియాడారు. అనంతరం ఆయన్ను దుశ్శాలువలు, గజమాలలతో సన్మానించారు. వైద్యాధికారులు సంధ్య, చంద్ర, మహేష్, జిల్లా ఏపీజీఏ అధ్యక్షుడు శివయ్య, జిల్లా అధికారులు ముఖేష్‌కుమార్, సుదర్శన్, జార్జి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసమూర్తి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపుతో తప్పని తిప్పలు

విజయపురం, జూన్ 25: మహారాజపురంలో మద్యం బెల్టుషాపుల వల్ల ఇబ్బందులు పడుతున్నామని మహారాజపురం దళితవాడ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనకమ్మసత్రం ఆంధ్రా తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావడంతో బెల్టుషాపు వ్యాపారం యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వీరు వాపోతున్నారు. ప్రభుత్వ మద్యం షాపులో నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తి షాపు మూసిన తరువాత మద్యం వ్యాపారం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మద్యం తాగడం వల్ల రోజూ ఇంట్లో గొడవలు జరుగుతున్నాయంటున్నారు. రాత్రి పగలు లేకుండా నిరంతరాయంగా మద్యం లభించడంతో మందు బాబుల వికృత చేష్టలను భరించలేక పోతున్నామంటున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

బంగారమ్మకు విశేష పూజలు



కార్వేటినగరం, జూన్ 25: కార్వేటినగరం బంగారమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించాట. బంగారమ్మను దర్శించకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జీవో 117 రద్దు చేయాలి : ఆపస్



విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆపస్ నాయకులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 25: విద్యాశాఖలో పలు ఇబ్బందులకు కారణమైన జీవో 117ను రద్దు చేయాలని కోరుతూ ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలు మంగళవారం విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. 3,4,5 తరగతుల విలీనం వెనక్కి తీసుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్2 హెచ్ఎం, పీడీ పోస్టులను మంజూరు చేయాలని, ఎంటీఎస్ కింద నియామకం కాబడిన 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులను రెగ్యులర్ చేయాలని కోరారు.

ఆర్కేలో ఎమర్జెన్సీ వ్యతిరేకదినం

చిత్తూరు (సెంట్రల్), జూన్ 25: స్థానిక ఆర్‌కే కళాశాలలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం నిర్వహించారు. బీజేపీ నాయకులు గాలి పుష్పలత, రాజేంద్రనాయుడు విద్యార్థులకు ఎమర్జెన్సీ దినం ప్రాముఖ్యతను వివరించారు. బీజేపీ నాయకులు దామోదర్, మోహన్, పూర్ణచంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న పార్థసారధినాయుడు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 25: ఇంటర్‌లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినులకు మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు నగదు ప్రోత్సహకాలు అందజేశారు. స్థానిక విద్యావికాస్ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ మార్కులు సాధించిన మౌనిక, దీపిక, సంతోషిణి విద్యార్థినులకు రూ.15 వేలు నగదు అందజేశారు. కళాశాల యాజమాన్యం తరపున రామచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



వెదురుకుప్పం, జూన్ 25: సంతబైలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం సంతబైలు గ్రామ కార్యదర్శి నరేష్ వితరణతో విద్యా సామగ్రి సహా మధ్యాహ్న భోజనానికి సంబంధించిన ప్లేటు, గ్లాసును తెలుగు మహిళా మండల నాయకురాలు రామకుమారి అందించారు. నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర వాటిని అందజేశారు.

ద్రౌపది మాన సంరక్షణ కార్యక్రమం

వెదురుకుప్పం, జూన్ 25: చవటగుంట ద్రౌపది అమ్మవారి మహాభారతం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ద్రౌపది మాన సంరక్షణ కార్యక్రమం జరిగింది. పగలు హరికథా కాలక్షేపం, రాత్రి వీధినాటకం ప్రదర్శించారు. ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. పెరుమాళ్లపల్లె సర్పంచ్ బండి శశిఆనందరెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు. హరిదాసు స్వర్ణలతకు ఉభయదారులు చీర,జాకెట్టు,పసుపు, కుంకుమ, తాంబూలం అందజేశారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జికి సన్మానం



మోహన్‌మురళిని సన్మానిస్తున్న ఎస్సీ నాయకులు

వెదురుకుప్పం, జూన్ 25: డాక్టర్ వీఎం థామస్ విజయానికి కృషి చేసిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళిని మంగళవారం వెదురుకుప్పంలో సన్మానించారు. మండలంలోని బలిజపల్లె కాలనీకి చెందిన ఎస్సీ యువ నాయకులు కె.నాగరాజు, ఎం.ప్రకాష్, కె.మురళి శాలువ కప్పి సన్మానించారు.

ఎంపీ దగ్గుమళ్లకు అభినందనలు



ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 25: ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, దళిత సంఘాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఢిల్లీ లోక్‌సభలో ఆయన ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయన టీడీపీ పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపికైనందుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు కాజూరు శీన, వాణిజ్యవిభాగం ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఏఎం వినోద్‌లు ఢిల్లీలో ఎంపీని కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి, దళిత ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధనంజయ రావు, ఏపి అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు పార్థసారథి మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

చిత్తూరు, జూన్ 25: వైసీపీ పరాజయం పాలైనా నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని ఏపీఎస్ ఆర్టీసీ మాజీ ఉపాధ్యక్షులు విజయానందరెడ్డి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో డివిజన్ల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. నగర మేయర్ అముద. చుడా మాజీ ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధులపై పాడిరైతులకు అవగాహన



పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యులు

బంగారుపాళ్యం, జూన్ 25: పశువుల గర్భకోశ వ్యాధులపై మంగళవారం స్థానిక పశువైద్యశాలలో రైతులకు అవగాహన కల్పించారు. సహాయ సంచాలకులు డాక్టర్ ఆసిఫ్ రైతులతో మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులను సకాలంలో గుర్తించి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. సుమారు 60 పశువులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ యాస్మిన్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

దళితవాడలో టీడీపీ నేతల సంబరాలు

పూతలపట్టు, జూన్ 25: పేట అగ్రహారంలో టీడీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టడంతో పాటు ఎమ్మెల్యేగా మురళీ మోహన్ గెలుపొందడంతో వీరు మంగళవారం భారీ కేక్‌ను కట్ చేశారు. ఇక్కడి పోలింగ్ బూత్‌లో వైసీపీకి 12, టీడీపీకి 721 ఓట్లు రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, నాయకులు గణపతి నాయుడు, సంపత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

పూతలపట్టు, జూన్ 25: సీఎంగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టడం, ఎంపీగా గ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేగామురళీ మోహన్‌లు గెలుపొందడంపై కమ్మగుట్టపల్లెకు చెందిన మహిళలు మంగళవారం ఉదయం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ముందుగా స్థానిక ఆలయం వద్ద పూజలు చేసి పాదయాత్రగా వెళ్లారు.

ఆగని వైసీపీ నాయకుల ఇసుక దందా

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

చిత్తూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా వైసీపీ అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. భూకబ్జాలు ఓ పక్క, ఇసుక దందా మరో పక్కా ప్రభుత్వ అధికారుల అండదండలతోనే వైసీపీ నాయకులు రెచ్చిపోతున్నారని ప్రచారం జరుగుతోంది. పెనుమూరు మండలంలోని ఓ వైసీపీ నాయకుడు గత ఐదేళ్లగా ఇసుక దందా చేశాడు. ు కూటమి అధికారంలోకి వచ్చినా అతను ఇసుక దందా మాత్రం ఆగలేదు. ఎన్టీఆర్ జలాశయంలో ఇసుకను రాత్రి పగలు ట్రాక్టర్‌లతో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. తమ ప్రభుత్వం వచ్చింది కదా అని స్థానికులు ఇసుక కోసం వెళితే వారి ట్రాక్టర్లు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు. వైసీపీ నాయకులు మాత్రం ఇష్టానుసారం ఇసుక తరలిస్తున్నా కూటమి నాయకులు ఏమీ చేయని నిస్సహాయ స్థితిలో ఉన్నారని సమాచారం. ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదంటున్నారు. పోలీసులు వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. వైసీపీకి కొమ్ముకాస్తున్న పోలీసులను వదిలిపెట్టబోమని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళతామని చెబుతున్నారు.



ఎన్టీఆర్ జలాశయం నుంచి ఇసుక తరలిస్తున్న దృశ్యం

నెలకు ట్రాక్టర్‌కు రూ.25 వేలు

మండలంలో ఇసుక రవాణా చేయాలంటే ట్రాక్టర్‌కు నెలకు రూ. 25వేలు చెల్లిస్తే అనుమతులు వస్తాయని చెబుతున్నారు. లేదంటే కేసులు నమోదవుతాయి, వాహనాలు సీజ్ అవుతున్నాయి. ఇన్నాళ్లూ అధికారంలేదు ఇప్పుడు మా ప్రభుత్వం వచ్చినా డబ్బులు కట్టి ఇసుక తోలుకోవాలంటే బాధగా ఉందని కూటమి నాయకులు వాపోతున్నారు.

వైభవంగా గుండాలమ్మ జాతర



అమ్మవారి సేవలో వీకే విశ్వనాథ్ తదితరులు

చిత్తూరు కల్చరల్, జూన్ 25: అశోక్‌పురంలోని గుండాలమ్మ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు మురుగేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి గరిగెను అశోక్‌పురంలో ఊరేగించిన అనంతరం అమ్మ వారికి తొలి పూజను నిర్వహించారు. భక్తులు అమ్మవారికి అంబలి సమర్పించి... జంతు బలిని ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భక్తులు ఉపకుంభ నైవేద్యం సమర్పించి మొక్కారు. దుర్గమ్మ గుడి పాలకమండలి మాజీ ఛైర్మన్ వీకే విశ్వనాథ్, సామాజిక సేవకుడు పార్థసారధినాయుడు, వల్లిటెక్స్ అమర, తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అశోక్‌పురంలో ఊరేగించనున్నారు. ఓంశక్తి భక్తులు తమ విన్యాసాలతో ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి పూలమాల సమర్పిస్తారని మురుగేశన్ తెలిపారు. భక్తులకు ప్రసాదంతో పాటు అన్నదానం చేశారు.

కమిషనర్ అరుణను వెంటనే బదిలీ చేయండి

● దళిత, ప్రజా సంఘాల డిమాండ్

చిత్తూరు సిటీ, జూన్ 25: నగరపాలక సంస్థ కమిషనర్ అరుణను వెంటనే బదిలీ చేయాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను, సిబ్బందిని వెంటనే బదిలీ చేయాలన్నారు. ఐదేళ్ళుగా జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. కమిషనర్ అవినీతి, అక్రమాలను అరికట్టకపోగా అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజా ధనాన్ని ప్రచార ఆర్భాటాలకోసం దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. కింది స్థాయి ఉద్యోగులను వేధించడం సరికాదన్నారు. సీనియర్ సిబ్బందికి ప్రమోషన్‌లు ఇవ్వకుండా, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. టౌన్ ప్లానింగ్ , ఇంజనీరింగ్, మెప్మా, రెవెన్యూ విభాగాల్లో భారీగా అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. సీపీఐ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, దళిత ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధనంజయ రావు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు పార్థసారథి, దళిత, ప్రజాసంఘాల నేతలు దామోదరన్, భాస్కర్, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

నిలిపివేసిన బస్సులు పునరుద్ధరించాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్‌టీయుసీ నేతలు మాధవనాయుడు, జీవరత్నం

గంగాధరనెల్లూరు, జూన్ 25: జిల్లాలోని వేర్వేరు రూట్లలో నిలిపేసిన ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని పార్లమెంట్ టీఎన్‌టీయుసీ అధ్యక్షుడు రావిళ్ళ మాధవనాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి జీవరత్నం కోరారు. ఈసందర్భంగా చిత్తూరు ఆర్టీసీ టూడిపో మేనేజర్‌ను కలిశారు. ఆర్టీసీ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని, పరిమితి లేని వైద్యసౌకర్యం కార్మికులకు కల్పించాలని, చిత్తూరు నుంచి గంగాధరనెల్లూరు మండలంకు రాత్రివేళల్లో వేర్వేరు రూట్లల్లో చివరి సర్వీసులను పునరుద్దరించాలన్నారు. చిత్తూరు - వేలూరు, చిత్తూరు - తిరువన్నామలై బస్సులను కొనసాగించాలని కోరుతూ మంగళవారం వినతిపత్రం అందజేశారు. టీడీపీ నేతలు శ్రీకృష్ణంరాజు, ధనంజయులు, టూడిపో కార్యదర్శులు జీవా, శేషాద్రి, రాజు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలు

గంగాధరనెల్లూరు, జూన్ 25: కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫోటోలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. మంగళవారం వేపంజేరి సచివాలయంలో వారి ఫొటోలను టీడీపీనేతలు గోడపై ఏర్పాటు చేయించారు. టీడీపీనేతలు క్రిష్టారెడ్డి, పద్మనాభరెడ్డి, మణిరెడ్డి, డి.సుబ్రమణ్యం, వెంకటేష్‌రెడ్డి, క్రిష్ణమూర్తిరెడ్డి, రాజేంద్రశెట్టి, దేవదానురెడ్డి, హరిప్రసాద్, మురుగేష్, గజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరల పతనంతో మామిడి రైతుల డీలా



బంగారుపాళ్యం, జూన్ 25: మామిడి ధరలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. 10 రోజుల క్రితం గుజ్జు పరిశ్రమకు తరలించే తోతాపురి కేజీ రూ.28 ధర పలకగా, మంగళవారం రూ.23కు పడిపోవడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. ఏడాది పొడవునా కష్టించి సాగుచేసి, మామిడిని మార్కెట్‌కు తరలిస్తే ఆశించిన మేర ధరల పలకకపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సీజన్ ప్రారంభ ధరలే ముగిసేవరకు ఉంటాయని ఆశించారు. ఒక్కసారిగా ధరలు పతనమయ్యాయి. మార్కెట్‌కు వచ్చిన టేబుల్ రకాలైన బేర్నిషా కిలో రూ.30 - రూ.70 వరకు పలకగా, మల్లిక కిలో రూ.40 - రూ.90 వరకు పలికింది. కాలేపాడు రూ.30 - రూ.80, మేలైన కలర్‌తోత రూ.30 - రూ.40 వరకు ధర పలికింది. నాటిరకాలు రూ.15 - రూ.20 మధ్య ధర పలికాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఉద్యాన మార్కెటింగ్‌శాఖ అధికారులు, అటు ప్రభుత్వం చర్యలు తీసుకుని గుజ్జు పరిశ్రమకు తరలించే తోతాపురి రకానికి కేజీ రూ.30 అయినా మద్ధతు ధరగా ప్రకటించాలని కోరుతున్నారు.

సీఎం సభకు భారీగా తరలిన జనం

రామకుప్పం, జూన్ 25: కుప్పంలో మంగళవారం సీఎం చంద్రబాబు బహిరంగసభకు రామకుప్పం మండలం నుంచి భారీ సంఖ్యలో జనం తరలివెళ్లారు. మహిళలు ఎక్కువ సంఖ్యలో వెళ్లారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ఎంపీ చిన్నకృష్ణ, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, మండల అధ్యక్షుడు వెంకటేష్, జనసేన మండల అధ్యక్షుడు హరీష్, నాయకులు సీతాపతి, రామ్మూర్తి, కృష్ణానాయక్, జయశంకర్, సత్తి, మహ్మద్‌రఫీ, గంట్లప్పగౌడు, విజయ్‌కుమార్‌రెడ్డి, కొళ్ళపల్లెబాబు, మనోహర్, చంద్రశేఖర్‌రెడ్డి, నందారెడ్డి, కేశవరెడ్డి, రామకృష్ణప్ప, టీవీరవి, సురేష్, నవీన్, పాండియన్, మురళీ, నాగభూషణం గజేంద్ర ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు వెళ్లాయి.

భక్తి ప్రపత్తులతో సంకరహర చతుర్ధశి పూజలు



చిత్తూరు కల్చరల్, జూన్ 25: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో మంగళవారం సాయి లింగేశ్వరస్వామికి భక్తి ప్రపత్తులతో సంకటహర చతుర్ధశి పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు మధుసూదనం, శ్రీకంఠయ్య, శేషనారాయణ, పాండురంగం, తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తం



నీళ్ల తొట్టెలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసన్న కుమారి

పూతలపట్టు, జూన్ 25: అతిసార వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని తేనేపల్లె, వేపనపల్లె తదితర పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. అతిసార నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసులుతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాళ్యంకొండ అభివృద్ధికి సహకరించండి



ఆలయ అభివృద్ధిపై సమీక్షిస్తున్న కమిటీ సభ్యులు

గుడిపాల, జూన్ 25: పాళ్యంకొండ అభివృద్ధికి దాతలు సహకరించాలని స్థానిక ఆంజనేయస్వామి ఆలయ అధ్యక్షుడు గురప్ప నాయుడు, ఉపాధ్యక్షుడు మోహన్ నాయుడు కోరారు. మంగళవారం ఏఎల్ పురం గ్రామంలోని ఓంశక్తి ఆలయం వద్ద పాళ్యంకొండకు రహదారి, మెట్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ట్రెజరర్ తారకరామ్, కమిటీ సభ్యులు రమేష్, రాజు, డిల్లీబాబు, భూపాల్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



ప్రమాద స్థలంలో హరి

గుడిపాల, జూన్ 25: చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో సోమవారం ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు హరి తమిళనాడు బాగాయానికి చెందిన వాడు. అక్కడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ హరి మంగళవారం మృతిచెందాడు. గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో యూరియా

నగరి జూన్25: మండల పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ అధికారి రాఘవేంద్రయాదవ్ ఓప్రకటనలో తెలిపారు. బుగ్గ అగ్రహారంలో 4.23 టన్నులు, గుండ్రాజుకుప్పంలో 5.22 టన్నులు, ఎం కొత్తూరులో 2 టన్నులు, ముడిపల్లిలో 4.5 టన్నులు, నంబాకంలో 4.27 టన్నులు, ఓజీకుప్పంలో 5.44 టన్నులు, ధెరణిలో 2.56, బీఎస్ఆర్‌పేటలో 3.19 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అవసరమైన రైతులు తమ పరిధిలోని రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి యూరియాను తీసుకోవచ్చున్నారు.



కుప్పంలో మంగళవారం సీఎం చంద్రబాబు రాక కోసం వేచి చూస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కోసం వేచి చూస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, నేతలు.. చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు వీఎం థామస్ (గంగాధరనెల్లూరు), గాలి భానుప్రకాష్ (నగరి), చిత్తూరు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, వేపంజేరి మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ